సాక్షి
రంగారెడ్డి
బుధవారం । 4 । సెప్టెంబర్ । 2024



ప్రకృతి ప్రకోపం

ప్రకృతి ప్రకోపానికి ఎంతటి వారైనా అతీతులు కారు. అది మోకిలలోని పలు విల్లాల్లో ప్రత్యక్షంగా కనిపిస్తోంది. 8లో▸



క్రేన్ బీభత్సం

క్రేన్ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు మరో రెండు దుకాణాలు ధ్వంసమయ్యాయి. 8లో▸



పోలీసుల నాకాబందీ

బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని షాహిన్ నగర్‌లో మంగళవారం సాయంత్రం పోలీసులు నాకాబందీ నిర్వహించారు. 8లో▸

న్యూస్‌రీల్

డిగ్రీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఆమనగల్లు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరంలో ప్రవేశానికి ఈనెల 4 నుంచి 9వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్ క్రింద దరఖాస్తు చేసుకోవాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీపాద శర్వాణి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిగ్రీలో ప్రవేశానికి ఇంతవరకు దరఖాస్తు చేసుకోనివారికోసం చివరి అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఫుడ్ లైసెన్సులు తప్పనిసరి

తుక్కుగూడ: జిల్లా వ్యాప్తంగా ఉన్న టిఫిన్ సెంటర్లు, హోటల్స్ నిర్వాహకులు, కిరాణ వ్యాపారులు తప్పనిసరి ఫుడ్ లైసెన్సులు తీసుకోవాలని జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి ఉదయ్ కిరణ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతో తమ కార్యాలయంలో లేదా, ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు 94923 01835, 97050 79576 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ రుణమాఫీ

జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు



రైతునేస్తం కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు

మహేశ్వరం: అర్హులందరికీ రుణమాఫీ వస్తుందని జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు పేర్కొన్నారు. మండల పరిధిలోని దుబ్బచర్ల గ్రామం రైతు వేదికలో మంగళవారం రైతు నేస్తం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాంకేతిక కారణలతో కొంత మందికి రుణమాఫీ కాలేదని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ మాఫీ చేస్తామన్నారు. అర్హత ఉండి మాఫీ కాని రైతులు ఆందోళన చెందొద్దని, ఇంటింటికీ తిరిగి వ్యవసాయాధికారులు సర్వే చేస్తున్నారన్నారు. పంటల సాగులో వ్యవసాయాధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. పొలాల్లో వర్షం నీరు నిల్వ ఉండకుండా తగు చర్యలు చేపట్టాలన్నారు. అంతకు ముందు రైతులకు పంటల సాగు, రుణమాఫీపై అవగాహన కల్పించారు. గ్రామంలో పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏడీఏ సుధారాణి, మండల వ్యవసాయాధికారి నాగమణి, పలువురు రైతులు పాల్గొన్నారు.

మైసిగండి హుండీ ఆదాయం రూ.15.40 లక్షలు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండి మైసమ్మ దేవత, శివాలయ రామాలయ దేవస్థానం హుండీ ఆదాయాన్ని దేవాదాయశాఖ సహాయ కమిషనర్ శేఖర్ సమక్షంలో దేవాదాయశాఖ అధికారులు మంగళవారం లెక్కించారు. మొత్తం 80 రోజులకు గాను, భక్తులు కానుకల రూపేణ వివిధ హుండీల్లో సమర్పించిన ఆదాయాన్ని లెక్కించగా రూ.15,40,206 ఆదాయం సమకూరింది. ఈ మొత్తాన్ని కడ్తాల్ కెనరా బ్యాంకులో డిపాజిట్ చేయనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఈవో స్నేహలత, ట్రస్టీ శిరోలీ, ఆలయ నిర్వాహకులు, ఉపప్రధాన అర్చకుడు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



తుక్కుగూడ: సర్దార్‌నగర్ సర్వే నంబర్ 131లోని ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మించిన మూడు ఇళ్లను మంగళవారం రెవెన్యూ అధికారులు కూల్చి వేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులు మాట్లాడుతూ.. ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ కృష్ణ, జూనియర్ అసిస్టెంట్ శేఖర్, ఆర్ఐలు పావని, స్వర్ణకుమారి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



చెరువు శిఖంలో వేసిన రోడ్డు



సర్వే నంబర్ 205లోని చెరువు నీటిలో డంప్ చేసిన మట్టి (ఫైల్)

ఆక్రమణలు తొలగేనా?

మాసబ్ చెరువుపై హైడ్రా దృష్టి సారించేనా?

- చెరువు శిఖం, ఎఫ్‌టీఎల్‌లో భారీగా బండరాళ్లు, మట్టి డంప్
- ఏడాది క్రితం పెద్ద ఎత్తున స్థానికుల ఆందోళనలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం
- తాజాగా హైడ్రా చర్యలతో చిగురిస్తున్న ఆశలు

తుర్కయంజాల్: నగర శివార్లలో కీలకమైన చెరువుల్లో ఒకటైన తుర్కయంజాల్‌లోని మాసబ్ చెరువు అక్రమాలపై (హైదరాబాద్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అండ్ అసెట్స్ ప్రొటెక్షన్ ఏజెన్సీ) హైడ్రా దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. ప్రస్తుతం హెచ్ఎండీఏ, రెవెన్యూ శాఖ లెక్కల ప్రకారం ప్రభుత్వ భూమి 342.32 ఎకరాలు, మరో 152.38 ఎకరాల పట్టా భూములు మొత్తం కలిపి 495 ఎకరాల్లో చెరువు విస్తరించి ఉంది. ఇందులో చాలా వరకు కబ్జాకు గురైంది. రియల్ వెంచర్లు ఏర్పాటయ్యాయి. కొన్ని అక్రమ నిర్మాణాలు సైతం వెలిశాయి. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ దూకుడుగా వ్యవహరిస్తూ చెరువులు, నాలాల ఆక్రమణలను తొలగిస్తుండటంతో మాసబ్ చెరువును పరిశీలించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని, చెరువును కాపాడాలని పర్యావరణ ప్రేమికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

శిఖం భూమిలో రోడ్డు వేసినా..

2023 మేలో గుర్రంగూడ వైపు నుంచి కొందరు రియల్టర్లు రైతుల ముసుగులో 5 నుంచి 6 అడుగుల ఎత్తులో నీళ్లున్న చెరువులో పెద్ద పెద్ద బండరాళ్లు, మట్టిని నింపారు. సుమారు 60 ఫీట్ల విస్తీర్ణంలో రోడ్డు వేసినప్పటికీ ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. అదే సమయంలో 'సాక్షి'లో వరుసగా కథనాలు ప్రచురితం కావడం, స్థానికుల నుంచి వ్యతిరేకత వ్యక్తం కావడంతో మే 21న కొందరిపై అప్పటి ఇరిగేషన్ ఏఈఈ మీర్‌పేట పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేసి చేతులు దులుపుకొన్నారు. ఆ తరువాత హడావుడిగా 23న కేవలం నాలుగు ట్రాక్టర్ల ద్వారా మట్టిని తొలగించి మమ అనిపించారు. రాజకీయ నేతల ఒత్తిళ్లతోనే అధికార యంత్రాంగం వెనుకడుగు వేసిందని అప్పట్లో చర్చనీయాంశమైంది.

ఉద్యమాలు చేసినా..

సాగర్ రహదారికి ఆనుకుని ఉన్న సర్వే నంబర్ 205లో 12 ఎకరాల భూమిలో 4 నుంచి 7 అడుగలకు పైగా నీళ్లున్నప్పటికీ 2023 మార్చిలో వందల టిప్పర్ల మట్టిని నింపి చెరువును పూడ్చారు. అయినప్పటికీ అధికారులు పట్టించుకోలేదు. 'మాసబ్ చెరువుపై రియల్ కన్ను' శీర్షికన 'సాక్షి'లో మార్చి 6న కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు ఆదిబట్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఒక్కరోజు మాత్రమే కొన్ని టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా మట్టిని తొలగించారు. ఆ తరువాత ఈ భూమిపై కోర్టులో వివాదం ఉందనే కారణంతో చర్యలు తీసుకోలేదు. దీనిపై అఖిలపక్ష నాయకులు మాసబ్ చెరువు పరిరక్షణ సమితిగా ఏర్పడి రాత్రి, పగలు లేకుండా కొన్ని రోజుల పాటు ఉద్యమాలు చేపట్టారు. అయినా అప్పటి పాలకుల్లో చలనం రాలేదు. వీటితో పాటు మరికొందరు రియల్టర్లు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో వెంచర్లు ఏర్పాటు చేసి ప్లాట్లు విక్రయించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో హైడ్రా ఆక్రమణలను గుర్తించి, అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చర్యలు తప్పవు



తుర్కయంజాల్‌లోని మాసబ్ చెరువుతో పాటు ఇబ్రహీంపట్నంలోని పెద్ద చెరువు ఆక్రమణదారులపై చర్యలు తప్పవు. గత పాలకులు, అధికారుల నిర్లక్ష్యం మూలంగా ఈ రెండు చెరువులు పెద్ద ఎత్తున ఆక్రమణకు గురయ్యాయి. చెరువుల పరిరక్షణకు సీఎం రేవంత్‌రెడ్డి హైడ్రా ఏర్పాటు చేసి చర్యలకు ఉపక్రమించడంతో ఆక్రమణదారుల్లో వణుకు మొదలైంది.

– మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎమ్మెల్యే, ఇబ్రహీంపట్నం

హైడ్రాకు ఫిర్యాదు చేస్తాం



హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెంటనే స్పందించి మాసబ్ చెరువును పరిశీలించాలి. దీనిపై త్వరలోనే అఖిలపక్షం ఆధ్వర్యంలో ఆయనను కలిసి ఫిర్యాదు చేస్తాం. చెరువును పరిరక్షించాలని గతంలో పెద్ద ఎత్తున పోరాటం చేశాం. తాజాగా పలు ఆక్రమణలను తొలగిస్తుండటంతో ఆశలు చిగురిస్తున్నాయి.

– బచ్చిగళ్ల రమేష్, మాసబ్ చెరువు పరిరక్షణ సమితి చైర్మన్

ఇప్పటికే నివేదికలు సమర్పించాం

మాసబ్ చెరువు అక్రమాలపై ఇప్పటికే ఉన్నతాధికారులకు పూర్తి స్థాయి నివేదికలు సమర్పించాం. శిఖం భూమి 137 సర్వే నంబర్‌లో రోడ్డు వేయడానికి ప్రయత్నం చేసిన వారిపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేశాం. సర్వే నంబర్ 205లో మట్టి డంప్ చేసిన వారిపైనా కేసులు నమోదు చేశాం. ఇటీవల ఏసీపీ చెరువును పరిశీలించారు. త్వరలోనే అక్రమార్కులపై చర్యలు తీసుకుంటాం.

– తాఫ్సీన్ రజా, ఇరిగేషన్ ఏఈ

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి

తలకొండపల్లి: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్తగా నివారణ చర్యలు చేట్టాలని సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీకాంత్ ఆధ్వర్యంలో మంగళవారం సీజనల్ వ్యాధులు–నివారణ చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. నాలుగైదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వివిధ రకాల వ్యాధులు ప్రబలే ప్రమాదముందని, సంబంధిత అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాలన్నారు. డెంగీ, చికున్‌గున్యా రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. సాధారణంగా గ్రామాల్లో వైరల్ జ్వరాలు, జలుబు, దగ్గు తదితర రుగ్మతలతో ఎక్కువగా బాధ పడ్తుంటారని.. ఫీవర్ సర్వే చేపట్టి ప్రజల ఆరోగ్య సమస్యలను నివారించాలన్నారు. ఎప్పటికప్పుడు వాటర్ ట్యాంక్‌లను శుభ్రపరిచి స్వచ్ఛమైన తాగు నీటిని అందించాలన్నారు. క్రమం తప్పకుండా మురుగు కాల్వలు, డ్రైనేజీలను శుభ్రపర్చాలన్నారు. రహదారులు, మురుగు కాల్వలు, తదితర అన్ని ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లి ఈగలు, దోమలు వ్యాప్తి చెందకుండా నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైతే స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకొని సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి ముత్యాలు, తహసీల్దార్ రంగారెడ్డి, ఎంపీడీఓ శ్రీకాంత్, ఎంపీఓ రఘు, మెడికల్ ఆఫీసర్స్ సైదమ్మ, స్నేహ, ఎంపీహెచ్ఈఓ ఆంజనేయులు, హెల్త్ అసిస్టెంట్‌లు మల్లయ్య, రామచంద్రయ్య, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి

జ్వరాలతో ఆందోళన వద్దు

- అన్ని జ్వరాలు డెంగీ కాదు
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు
- జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు



ఆస్పత్రిలో వార్డును పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు

షాద్‌నగర్: సీజనల్‌గా వచ్చే జ్వరాలతో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, జ్వరాలన్నీ డెంగీ కాదని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు అన్నారు. షాద్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చికిత్స పొందుతున్న బాధితులతో మాట్లాడారు. వైద్యం ఎలా అందుతోందని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎవరికైనా జ్వరం వచ్చి నాలుగైదు రోజులైనా తగ్గకుంటే వెంటనే రక్త పరీక్ష చేయించుకొని డెంగీని నిర్ధారించుకోవాలని సూచించారు. ఉదయం పూట కుట్టే దోమతో డెంగీ వస్తుందని అన్నారు. మామూలుగా జ్వరం వచ్చినా ప్లేట్‌లెట్స్ తగ్గుతాయన్నారు. డెంగీ వచ్చి 20వేల కంటే ప్లేట్‌లెట్స్ తగ్గితే వైద్యుల సలహాలు, సూచనల మేరకు ప్లాస్మా, ప్లేట్‌లెట్స్ ఎక్కించుకోవాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్ని వ్యాధుల నిర్ధారణకు సంబంధించి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే దోమలు, ఈగలు వ్యాపిస్తాయని దీంతో డెంగీ, మలేరియా, చికున్‌గున్యా వంటి వ్యాధులు వస్తాయని తెలిపారు. డ్రైనేజీలు శుభ్రం చేసుకోవాలని, గుంతల్లో నీరు నిల్వకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఇళ్లలో దోమలు, ఈగలు రాకుండా చూసుకోవాలని, తగిన జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధులను నివారించవచ్చని వివరించారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 210 డెంగీ, మూడు మలేరియా కేసులు నమోదైనట్లు వెల్లడించారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టిందని చెప్పారు. ప్రభుత్వ హాస్టళ్లు, గ్రామాల్లో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా అనారోగ్యానికి గురైతే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చి వైద్యం చేయించుకోవాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు, సురేష్, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దఅంబర్‌పేట.. మొదలైంది ఆట

- చైర్‌పర్సన్‌పై అవిశ్వాసానికి ముహూర్తం ఖరారు
- ఈ నెల 13న మున్సిపల్ కార్యాలయంలో సమావేశం
- మొత్తం 24 మంది కౌన్సిలర్లలో నోటీసు ఇచ్చిన 17 మంది
- చైర్‌పర్సన్ చెవుల స్వప్నపై సొంత పార్టీ నుంచే వ్యతిరేకత
- అందరి దృష్టి ప్రత్యేక సమావేశంపైనే..



పెద్దఅంబర్‌పేట మున్సిపల్ కార్యాలయం

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట మున్సిపల్ చైర్‌పర్సన్ చెవుల స్వప్నపై అవిశ్వాస తీర్మానం పెడుతూ 17 మంది కౌన్సిలర్లు కలిసి ఇచ్చిన నోటీసును కలెక్టర్ పరిగణనలోకి తీసుకున్నారు. ఈ మేరకు వారి సంతకాల పరిశీలన కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి ఇప్పటికే పూర్తి చేయగా మొత్తం 17 మందిలో 15 మంది కౌన్సిలర్ల సంతకాలు వారివేనని, మిగిలిన ఇద్దరు కౌన్సిలర్ల సంతకాల్లో కొంచెం మార్పులున్నాయని నిర్ధారించి నివేదికను కలెక్టర్‌కు పంపించారు. ఈ మేరకు 2019 మున్సిపల్ చట్టం సెక్షన్ 37 ప్రకారం ఈనెల 13న ఉదయం 11 గంటలకు ప్రత్యేక సమావేశం ఏర్పాటుకు ముహూర్తం ఖరారు చేశారు. సమావేశానికి కౌన్సిలర్లు హాజరు కావాలని కలెక్టర్ జారీ చేసిన నోటీసులను స్థానిక అధికారులు కౌన్సిలర్లకు మంగళవారం అందజేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంతరెడ్డి ఆధ్వర్యంలో ఓటింగ్ నిర్వహించనున్నారు.

పార్టీలకు అతీతంగా తిరుగుబాటు

పెద్దఅంబర్‌పేట చైర్‌పర్సన్ చెవుల స్వప్న తీరుపై ఆది నుంచి అసంతృప్తితో ఉన్న మెజార్టీ కౌన్సిలర్లు పార్టీలకు అతీతంగా తిరుగుబాటు చేస్తున్నారు. సాధారణ ఎన్నికలకు ముందు వరకూ బీఆర్ఎస్‌లో కొనసాగిన ఆమెపై ఆ పార్టీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీతో పాటు ఇతరులతో కలిసి గతేడాది జనవరిలో అవిశ్వాస నోటీసు అందజేసిన విషయం తెలిసిందే. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ గూటికి చేరిన స్వప్నకు ఈ పార్టీలోనూ తిరుగుబాటు తప్పలేదు. మొత్తం 24 మంది కౌన్సిలర్లు ఉండగా కాంగ్రెస్ పార్టీకి చెందిన 9 మంది, బీఆర్ఎస్‌కు చెందిన ఐదుగురు, ముగ్గురు ఇతరులు పార్టీలకు అతీతంగా చైర్‌పర్సన్‌ను గద్దె దింపేందుకు ఏకమై గతనెల 19న మరోసారి అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు.

వైస్‌చైర్‌పర్సన్ దారెటు..?

గతేడాది జనవరిలో చైర్‌పర్సన్ చెవులు స్వప్నతో పాటు వైస్ చైర్‌పర్సన్ చామ సంపూర్ణపై కూడా కౌన్సిలర్లు అవిశ్వాస నోటీసులు అందించారు. ఈ క్రమంలో చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఇద్దరూ కలిసి తమ మద్దతుదారులతో క్యాంపులకు వెళ్లిన విషయం తెలిసిందే. అవిశ్వాస పంచాయతీ ముగిసే వరకూ చైర్‌పర్సన్‌కు తోడుగా ఉన్న వైస్ చైర్‌పర్సన్ ఈసారి మాత్రం అందుకు భిన్నంగా ఉన్నట్లు సమాచారం. ఈసారి కేవలం చైర్‌పర్సన్ ఒక్కరిపైనే అవిశ్వాస నోటీసు జారీ చేసిన నేపథ్యంలో తాను సేఫ్‌గా ఉన్నాననే భావలో వైస్ చైర్‌పర్సన్ ఉన్నట్లు తెలుస్తోంది. తన పదవికి గండం లేకపోవడంతో చైర్‌పర్సన్‌పై అవిశ్వాస నోటీసులు అందించేందుకు వెళ్లిన కౌన్సిలర్లకు మద్దతుగా తన వర్గంగా భావించే ఇద్దరు కౌన్సిలర్లను పంపించి పరోక్షంగా మద్దతు తెలిపినట్లు సమాచారం. చైర్‌పర్సన్ బలపరీక్ష కోసం అధికారులు సమావేశ తేదీని ఖరారు చేసిన నేపథ్యంలో వైస్ చైర్‌పర్సన్ ఏ నిర్ణయం తీసుకుంటారనేది చర్చనీయాంశంగా మారింది.

సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్దాం



సమావేశమైన ఎమ్మెల్యేలు, స్థానిక సంస్థల ప్రతినిధులు

శంషాబాద్: మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ఉన్న సమస్యలపై జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, మేయర్‌లు, మున్సిపల్ చైర్‌పర్సన్‌లు శంషాబాద్ పట్టణంలో మంగళవారం సమావేశమయ్యారు. ఈ మేరకు నిర్ణయాలు వెల్లడించారు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో వీధి దీపాల నిర్వహణ నుంచి ఈఈఎస్ఎల్ సంస్థను పూర్తిగా తప్పించాలన్నారు. కేవలం దీపాలను బిగించడం తప్ప వాటి మరమ్మతులు, ఇతర నిర్వహణను సదరు సంస్థ ఏమాత్రం పట్టించుకోవడంలేదన్నారు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో హెచ్ఎండీఏ ఇస్తున్న అనుమతులకు స్థానిక సంస్థల ఎన్ఓసీలను తప్పనిసరి చేయాలన్నారు. హైదరాబాద్ మెట్రో వాటర్ బోర్డు అన్ని నల్లాలను క్రమబద్ధీకరించడమే కాకుండా జీహెచ్ఎంసీ పరిధిలో ఇస్తున్న మాదిరిగా ఉచిత నీటిని అందించాలని డిమాండ్ చేశారు. స్టాంప్ డ్యూటీల్లో యాభైశాతం స్థానిక సంస్థలకే అందించాలన్నారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా స్థానిక సంస్థల్లో ఉద్యోగులను సంఖ్యను పెంచుకునేందుకు వెసులుబాటు కల్పించాల్సి ఉందన్నారు. పై డిమాండ్లన్నింటినీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడానికి నిర్ణయించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, ప్రకాష్‌గౌడ్, కాలె యాదయ్య, వీర్లపల్లి శంకర్, బడంగ్‌పేట్ మేయర్ పారిజాత, శంషాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్‌పర్సన్ స్రవంతి, తుర్కయంజాల్ మున్సిపల్ చైర్‌పర్సన్ అనురాధ తదితరులు పాల్గొన్నారు.

వర్షాల నష్టంపై నివేదిక ఇవ్వండి

అధికారులకు కలెక్టర్ శశాంక ఆదేశం



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

ఇబ్రహీంపట్నం రూరల్: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు దెబ్బతిన్న ఆస్తులు, ఇళ్ల వివరాలను సేకరించి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ శశాంక అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రెండు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలతో జిల్లాలో దాదాపు 40 ఇళ్లు పాక్షికంగా, రెండు ఇళ్లు పూర్తిగా ధ్వంసమైనట్లు గుర్తించామని తెలిపారు. ఏ మేరకు నష్టం వాటిల్లిందో వివరాలు సమర్పించాలన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సమష్టిగా నాలాల పరిసరాలను పరిశీలించి జాగ్రత్తలు తీసుకునేలా చొరవ చూపాలన్నారు. ఆర్డీఓలు, తహసీల్దారులు తమ పరిధిలో ఏదైనా విలువగల ప్రభుత్వ భూమి ఉన్నట్లయితే వెంటనే వాటికి కంచె వేసేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలోని 100 చెరువులకు ప్రిలిమినరీ నోటిఫికేషన్ పెండింగ్‌లో ఉందన్నారు. ఇప్పటి వరకు 925 చెరువుల్లో 99 మాత్రమే ఫైనల్ నోటిఫికేషన్ పూర్తి చేయడం జరిగిందన్నారు. మిగిలిన చెరువులకు త్వరితగతిన ఫైనల్ నోటిఫికేషన్ పూర్తి చేయాల్సి ఉందన్నారు. వారానికి 30 నుంచి 40 చెరువులను సర్వే నిర్వహిస్తే సకాలంలో పూర్తవుతుందని కలెక్టర్ సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ల్యాండ్‌ప్రొటెక్షన్ అధికారి కుమారి, తహసీల్దార్లు, ఆర్డీఓలు పాల్గొన్నారు.

క్రేన్ బీభత్సం

- డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, రెండు షాపులు ధ్వంసం
- గాయాలపాలైన యువకుడు


నేలకూలిన ట్రాన్స్‌ఫార్మర్


ధ్వంసమైన కిరాణ కొట్టు

ఇబ్రహీంపట్నం: క్రేన్ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటుగా రెండు షాపులు ధ్వంసమయ్యాయి. ఈ ఘటన ఇబ్రహీంపట్నం పాత బస్టాండ్ వద్ద మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ రామకృష్ణ, బాధితులు తెలిపిన ప్రకారం.. రాయపోల్ రోడ్డు నుంచి పాత బస్టాండ్ వైపు ప్రయాణిస్తున్న ఓ క్రేన్ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా అదుపు తప్పి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెను ఢీకొట్టింది. పక్కనే ఉన్న ఓ కిరాణ కొట్టులో సామగ్రి, బార్బర్ షాపుల రేకులు దెబ్బతిన్నాయి. దుకాణంలో పనిచేసే రజాక్ అనే యువకుడికి స్వల్పగాయాలయ్యాయి. ట్రాన్స్‌ఫార్మర్ నేలకూలిన వెంటనే విద్యుత్ ట్రిప్ అవ్వడంతో పెను ప్రమాదం తప్పింది. మంగళవారం కావడంతో బార్బర్ షాపులు మూసి ఉన్నాయి. బీహార్‌కు చెందిన డ్రైవర్ జమీర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

రూ.5లక్షల నష్టం

క్రేన్ ఢీకొట్టడంతో ట్రాన్స్‌ఫార్మర్ కింద పడి ఆయిల్ పూర్తిగా లీక్ అయింది. ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటుగా విద్యుత్ ఆన్‌ఆఫ్ స్విచ్ బాక్సులు, వైర్లు ధ్వంసమయ్యాయి. దీంతో సుమారు రూ.5లక్షల నష్టం వాటిల్లింది. పాత బస్టాండ్ ఏరియాలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పునరుద్ధరణ చర్యలు చేపట్టాం.

– శ్రీనివాస్‌రావు, విద్యుత్ ఏఈ

పెళ్లి కాలేదని.. మనస్తాపం చెంది

యువకుడి బలవన్మరణం


విక్రంచారి మృతదేహం


షాద్‌నగర్‌రూరల్: పెళ్లి కావడం లేదనే మనస్తాపంతో జీవితంపై విరక్తి చెందిన యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామశివారులో మంగళవారం చోటు చేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ సాజిద్ తెలిపిన ప్రకారం.. కొందుర్గు మండలం గంగన్నగూడ గ్రామానికి చెందిన గోవర్ధనాచారి, పుష్పమ్మ దంపతుల చిన్న కుమారుడు విక్రంచారి(28) కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. తనకు ఇంకా పెళ్లి కావడం లేదని మనస్తాపంతో బాధ పడుతుండేవాడు. రోజు మాదిరిగానే పని వెళుతున్నానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. మధ్యాహ్నం ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద గ్రామ శివారులోని ఓ చెట్టుకు విక్రంచారి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు వెంటనే అక్కడికి వెళ్లే వరకే మృతి చెందాడు. విగతజీవిగా ఉన్న తమ కొడుకును చూసి బోరున విలపించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు. మృతుడి తల్లి పుష్పమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రకృతి ప్రకోపం


లా పలోమాలో చెరువును తలపిస్తున్న రోడ్డు

మేల్కొనకపోతే.. పెను ప్రమాదం

- కాలువలు, కుంటలు ఆక్రమించి నిర్మాణాలు
- నీట మునిగిన విల్లాలు
- శాశ్వత పరిష్కారానికి ఎమ్మెల్యేతో సమావేశం



లా పలోమా ఎంట్రెన్స్ గేటు

శంకర్‌పల్లి: ప్రకృతి ప్రకోపానికి ఎంతటి వారైనా ఫలితం అనుభవించాల్సిందే. ప్రస్తుతం మండల పరిధిలోని మోకిలలోని పలు విల్లాలలో ప్రత్యక్షంగా కనిపిస్తోంది. కోట్లు విలువ చేసే స్థలాలను ఆక్రమించి, సహజసిద్ధంగా వెళ్లే నీటి ప్రవాహానికి అడ్డుకట్ట వేయడంతో ప్రకృతి దాని పని అది చేసుకుంటూ వెళ్లిపోయింది. మోకిలలో కాల్వలు, కుంటలపై అక్రమ నిర్మాణాలపై కథనం.

కాలువలు, కుంటలపై నిర్మాణాలు

మోకిలలో గజం స్థలం కనిపించినా ఆక్రమించడమే తరువాయి అన్న చందంగా పరిస్థితి తయారైంది. ఎకరానికి రూ.కోట్లలో ధర పలకడం.. శ్రీమంతులు ఇక్కడ నివసిస్తుండడమే ఇందుకు ప్రధాన కారణం. మోకిల మీదుగా సహజసిద్ధంగా ప్రవహించి, చెరువులు, కుంటల్లో కలిసే కాలువలు చాలా ఉన్నాయి. అవి రెవెన్యూ రికార్డుల్లో లేకపోవడం.. బిల్డర్లకు కలిసి వచ్చింది. ఇంకేం కాలువలను కబ్జా చేసి, వాటిపై అక్రమ నిర్మాణాలు చేపట్టి కోట్ల రూపాయలకు విక్రయిమొదలు పెట్టారు. దీంతో హెచ్ఎండీఏ అధికారులు చూసి చూడనట్లు తూతూమంత్రంగా విచారించి అనుమతులు జారీ చేస్తున్నారు.

యథేచ్ఛగా కబ్జాలు

వర్షాలు కురిసినప్పుడు మండల పరిధిలోని కొండకల్, మోకిలతండా నుంచి కాల్వల ద్వారా వచ్చే నీరు మోకిలలోని ఈడెన్ గార్డెన్స్ వద్ద ఓ కుంటలోకి ప్రవహిస్తుంది. ఈ గొట్టిముక్కల కాల్వ ద్వారా ఈడెన్ గార్డెన్స్ వద్ద కుంట నిండి తర్వాత ఆ నీరు ఫిరంగి నాలా(బుల్కాపూర్ నాలా)లో కలుస్తుండేది. కాలక్రమంలో ఆ ప్రాంతంలో దాదాపు పది వెంచర్లు ఏర్పడ్డాయి. అక్కడ సహజసిద్ధంగా ప్రవహించే కాల్వలను బిల్డర్లు గుట్టుచప్పుడు కాకుండా కబ్జా చేశారు. దీంతో సహజంగా కాలువల గుండా వచ్చే వరద నీరు విల్లాలోకి భారీగా వచ్చి చేరుతుంది. 2022లో ఇదే పరిస్థితి వచ్చినప్పుడు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు స్పందించి సర్వే చేపట్టారు. అక్కడ గొట్టిముక్కల కాల్వను గుర్తించి.. నీటి ప్రవాహానికి వీలుగా మార్కింగ్ చేశారు. లా పోలోమా వారు అధికారులు సూచించినా విధంగా కాకుండా ఇష్టానుసారంగా చిన్న పైప్‌లైన్ వేసి చేతులు దులుపుకున్నారు. 2023లో ఎన్‌ఓసీ తెచ్చుకుని లైన్ క్లియర్ చేసుకున్నారు. వరద నీటి మళ్లింపు ప్రక్రియ సక్రమంగా జరగకపోవడంతో ఇటీవల భారీగా వరద నీరు వచ్చి విల్లాల్లో చేరింది.

శాశ్వత పరిష్కారం చూపాలి



అధికారులు అంతా తమ సమస్యపై శ్రద్ధ చూపాలి. వారు తీసుకునే ఎలాంటి నిర్ణయానికైనా మద్దతిస్తాం. కానీ శాశ్వత పరిష్కారం చూపాలి.

– రాజా చంద్ర, విల్లా యాజమాని, లా పలోమా

అడ్డు గోడ కట్టారు



మూడేళ్లుగా ఇక్కడ నివసిస్తున్నాం. 2022లో ఇదే సమస్య వస్తే పైప్‌లైన్ నిర్మించుకున్నాం. మా ముందు ఉన్న వాళ్లు కొత్త నిర్మాణాలు చేపడుతూ పైప్‌లైన్‌ని బ్లాక్ చేశారు. దీంతో ప్రస్తుతం తమకు ఈ సమస్య ఎదురైంది.

– అరుణ్, విల్లా యాజమాని, లా పలోమా

భవిష్యత్‌పై సమాలోచనలు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే యాదయ్య, చిత్రంలో అధికారులు

శంకర్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మోకిలలోని బిల్డర్లు, విల్లాలలోని ప్రజలు, స్థానిక ఎమ్మెల్యే యాదయ్య, ఆర్డీఓ సాయిరాం, హెచ్ఎండీఏ ఇంజనీర్ మల్లికార్జున రావు, ఇరిగేషన్ డీఈ పరమేష్, తహసీల్దార్ సురేందర్, శంకర్‌పల్లి మున్సిపాలిటీ కమిషనర్ శ్రీనివాస్ ఎంపీడీఓ వెంకయ్య, మోకిల సీఐ వీరబాబు, శంకర్‌పల్లి సీఐ హబీబుల్లాఖాన్‌లు కలిసి విల్లాలలో వచ్చే వరద నీటిపై భవిష్యత్ ప్రణాళికపై చర్చ ఏర్పాటు చేశారు. అధికారులు, విల్లాల ప్రజల మధ్య సమావేశం కాసేపు రసాభాసగా సాగింది. చివరికి అధికారులు పలు నిర్ణయాలను వెల్లడించారు. ప్రతీ వెంచర్ నుంచి నీటి ప్రవాహం వెళ్లేలా చర్యలకు అనుమతివ్వాలని.. అనంతరం హెచ్ఎండీఏ అధికారులకు సంయుక్తంగా వినతిపత్రం ఇవ్వాలని తీర్మాణించారు. అనంతరం హెచ్ఎండీఏ సూచనల మేరకు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సంయుక్తంగా ఓ మ్యాప్ తయారు చేసి ఓపెన్ కాల్వ నిర్మించేందుకు సిద్ధమన్నారు. ఇందుకు ప్రతినిధులు సైతం మాట్లాడుకుని చెబుతామని స్పష్టం చేశారు. భవిష్యత్‌లో సమస్య పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఎమ్మెల్యే యాదయ్య సూచించారు.

అదుపుతప్పిన బైక్

మహిళకు గాయాలు

కడ్తాల్: బైక్ అదుపుతప్పి ఓ మహిళ గాయపడింది. ఈ ఘటన మండల పరిధిలోని మక్తమాదారం సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన పా ర్వతమ్మ తన కుమారుడితో కలిసి బైక్‌పై కొత్తపేట్‌కు వెళ్లింది. తిరిగి స్వగ్రామానికి వస్తుండగా వెనుకనుంచి లారీ వేగంగా వస్తుండడంతో బైక్‌ను పక్క కు తీసుకునే క్రమంలో అదుపుతప్పింది. దీంతో పా ర్వతమ్మ కిందపడి గాయాల పాలైంది. క్షతగాత్రురాలిని చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

శివాజీ చౌక్ వద్ద అండర్ పాస్ నిర్మించండి

కేంద్ర మంత్రికి వినతి


కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

అబ్దుల్లాపూర్‌మెట్: మండల పరిధిలోని బాటసింగారం గ్రామానికి వెళ్లే మార్గంలో శివాజీ చౌక్ వద్ద అండర్ పాస్ నిర్మించాలని బాటసింగారం, సింగరేణి కాలనీ, జాఫర్‌గూడ గ్రామస్తులు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కోరారు. మంగళవారం బీజేపీ మండల అధ్యక్షుడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు బండిగారి విష్ణుగౌడ్ ఆధ్వర్యంలో కిషన్‌రెడ్డిని కలిశారు. విజయవాడ జాతీయ రహదారి విస్తరణలో రోడ్డు వెడల్పుగా మారిందని దీంతో ఇక్కడ రోడ్డు దాటాలంటే ఇబ్బందులు తలెత్తుతాయని వివరించారు. సుమారు 16 గ్రామాల ప్రజలకు అనువుగా ఉండే శివాజీ చౌక్ వద్ద అండర్ పాస్ వంతెన నిర్మించాలని కోరారు. ఇందుకు ఆయన కేంద్ర రహదారుల మంత్రి నితిన్‌గడ్కరీ దృష్టికి సమస్యను తీసుకెళ్తానన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఎంసీ యాదగిరి, వెంకట్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, జంగయ్య, వెంకటరంగారెడ్డి, భీమయ్య, నర్సింహగౌడ్, కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

గుడిలో విగ్రహం మాయం

మణికొండ: చెరువు కట్టపై ఉన్న అమ్మవారి ఆలయంలో విగ్రహం మాయం అయ్యిందని, పక్కనే నిర్మాణం చేస్తున్న సంస్థ వారే తీసి ఉంటారని నార్సింగి వాసులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలోని ముప్కి చెరువు కట్ట పక్కన ఉన్న కట్టమైసమ్మ దేవాలయాన్ని తొలగించాలని పక్కనే నిర్మాణం చేపట్టిన ఓ రియల్ ఎస్టేట్ గ్రూపు యాజమాన్యం కోరిందని నార్సింగి వాసులు అన్నారు. అయితే తాము అంగీకరించక పోవటంతో సోమవారం సాయంత్రం అందులోని విగ్రహాన్ని తొలగించారని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. చెరువు కింద ముంపుకు గురయ్యే ప్రాంతంలో నిర్మాణాలు చేపట్టడం కాకుండా అడ్డుగా ఉందని ఏకంగా ఆలయాన్ని లేకుండా చేయాలని చూస్తున్నారని, వారిపై హైడ్రాకు ఫిర్యాదు చేస్తామన్నారు. వెంటనే వారిపై అధికారులు చర్యలు తీసుకుని దేవాలయాన్ని పునరుద్ధరించాలని వారు కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో నార్సింగి గ్రామస్థులు పాల్గొన్నారు.

బాలాపూర్ పోలీసుల నాకాబందీ


వాహనాల తనిఖీని పర్యవేక్షిస్తున్న డీసీపీ సునీతారెడ్డి

పహాడీషరీఫ్: బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని షాహిన్‌నగర్‌లో మంగళవారం సాయంత్రం పోలీసులు నాకాబందీ నిర్వహించారు. మహేశ్వరం డీసీపీ డి.సునీతారెడ్డి పర్యవేక్షణలో ఏసీపీ పి.లక్ష్మీకాంత రెడ్డి, బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ టి.భూపతి సీఆర్‌పీఎఫ్ బలగాలతో కలిసి తనిఖీలు చేపట్టారు. అనుమానితుల నేర చరిత్రను పరిశీలించడంతో పాటు ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనదారులను, సరైన నంబర్ ప్లేట్లు లేకుండా తిరుగుతున్న వాహనాలు, చోరీ చేసిన బైక్‌లపై తిరుగుతున్న వారిని అదుపులోకి వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో నేరాల సంఖ్య పెరుగుతున్నందున ఈ ప్రాంతంపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. రౌడీషీటర్ల కదలికలపై ఎప్పటికప్పు నిఘా కొనసాగిస్తూ.. ఆకస్మిక సోదాలు చేపడుతున్నామన్నారు. గంజాయి, డ్రగ్స్‌పై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

విపత్కర సమయంలో రాజకీయాలా..?

- ప్రజలకు అండగా ఉంటూ ప్రభుత్వానికి సహకరించాలి
- బీఆర్ఎస్ నేతలపై డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి మండిపాటు


మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్: ప్రకృతి వైపరీత్యమైన వర్షాలను సైతం బీఆర్ఎస్ నాయకులు రాజకీయాలకు వాడుకోవడం దారుణమని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి మండిపడ్డారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వరద ప్రాంతాల్లో ప్రజలను ఆదుకునేందుకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు ఆయా ప్రాంతాల్లో పర్యటిస్తూ సహాయక చర్యలు చేపడుతున్నారు. సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారాలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులకు ప్రభుత్వ సహకారం కనబడడం లేదా అని ప్రశ్నించారు. భారీ వర్షాలతో నష్టపోయిన రైతులతో పాటు, ప్రజలందరిని కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకుంటుందని, పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10వేలు సాయం ప్రకటించిందని గుర్తు చేశారు. ఇళ్లు కూలిపోయిన బాధితులకు ఇందిరమ్మ పథకం క్రింద ఇళ్లను మంజూరు చేస్తామని చెప్పారని గుర్తు చేశారు. విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు అండగా ఉంటూ ప్రభుత్వానికి సూచనలు, సలహాలు అందజేయాల్సిన విపక్షాలు కుట్ర రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మండల అధ్య క్షుడు బీచ్యానాయక్, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, మాజీ కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, రాంచందర్‌నాయక్, లక్ష్మయ్య, మల్లేశ్‌గౌడ్, జహంగీర్‌అలీ, రాజేందర్, శ్రీను, యాదయ్య, భానుకిరణ్, బుచ్చయ్య పాల్గొన్నారు.

ఇద్దరు చిన్నారులపై వీధి కుక్కల దాడి


గాయపడిన బాలుడు

తుక్కుగూడ: వీధి కుక్కల దాడిలో ఇద్దరు చిన్నారులు గాయపడ్డారు. ఈ ఘటన తుక్కుగూడ మున్సిపల్ కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. లక్ష్మీగార్డెన్ సమీపంలో ఉండే ఇద్దరు చిన్నారులు స్థానికంగా ఉండే కిరాణ దుకాణానికి వెళ్తుండగా వారిపై ఒక్కసారిగా రెండు వీధి కుక్కలు దాడి చేశాయి. దీంతో చిన్నారులు గాయపడ్డారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ వైస్ చైర్మన్ బి.వెంకట్‌రెడ్డి స్థానికంగా ఉన్న ఆస్పత్రికి తరలించారు.

8 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

అక్రమంగా సేకరించిన వ్యక్తి అరెస్టు

శంషాబాద్ రూరల్: రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించేందుకు యత్నిస్తున్న ఓ వ్యక్తిని శంషాబాద్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... శంషాబాద్ పట్టణానికి చెందిన రెహాన్ బాబా గ్రామాల్లో తిరుగుతూ తక్కువ ధరకు రేషన్ బియ్యాన్ని సేకరిస్తుంటాడు. మంగళవారం పలు గ్రామాల్లో రేషన్ బియ్యం కొనుగోలు చేసి బియ్యం బస్తాలను ఓ చోట పెట్టాడు. ఈ క్రమంలో గొల్లపల్లి వద్ద బైక్‌పై అనుమానాస్పదంగా తిరుగుతుండగా పెట్రోలింగ్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. 800 కిలోల రేషన్ బియ్యంతో ఉన్న 16 సంచులను గుర్తించారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

భార్యను హత్య చేసి.. ఆత్మహత్యగా చిత్రీకరణ

- భర్తకి పదేళ్ల జైలు, రూ.5 లక్షల జరిమానా
- తీర్పు వెలువరించిన కోర్టు

శంకర్‌పల్లి: అదనపు కట్నం కోసం గర్భిణిగా ఉన్న తన భార్యను హత్య చేసి.. ఆపై ఆత్మహత్యగా చిత్రీకరించాడో కీచక భర్త. పదకొండేళ్ల తర్వాత చివరికి కోర్టు తీర్పుతో పదేళ్ల జైలు శిక్షతో కటకటాలపాలయ్యాడు. శంకర్‌పల్లి సీఐ హబీబుల్లాఖాన్ తెలిపిన వివరాల ప్రకారం.. మొయినాబాద్ మండలం పెద్ద మంగళారం గ్రామానికి చెందిన ఈశ్వరయ్య తన కూతురైన స్వప్నని శంకర్‌పల్లి మండలం సంకేపల్లికి చెందిన మానేష్ గౌడ్(35)కి ఇచ్చి 2012లో వివాహం చేశాడు. మానేష్ పెళ్లి అయినప్పటి నుంచి అదనపు కట్నం కోసం భార్యని వేధించాడు. ఈ క్రమంలో మూడు నెలల గర్భిణి అయిన స్వప్న పుట్టింటికి వెళ్లింది. 2013 మార్చి 22న తిరిగి వచ్చింది. మానేష్ భార్యతో అదనపు కట్నం కోసం గొడవ పడి.. ఆవేశంలో ఆమెని కొట్టాడు. ఆ సమయంలో స్వప్న చేయికి గాయమైంది. అనంతరం ఆమెకి ఊపిరి ఆడకుండా చేసి, హత్య చేశాడు. తర్వాత ఇంట్లోని ఫ్యాన్‌కి ఉరివేసి ఆత్మహత్యగా చిత్రీకరించాడు. కుటుంబ సభ్యులు, బంధువులకు ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం ఇచ్చాడు. అయితే అల్లుడి ప్రవర్తనపై మామ ఈశ్వరయ్య అనుమానం కల్గింది. దీంతో శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు చేసిన పోలీసులు మానేష్‌గౌడ్ ఇంట్లో పగిలిన గాజులు, ఫ్యాన్ ఎత్తు చాలా ఎక్కువగా ఉండడం, పోస్టుమార్టం రిపోర్టులో చేయి డిస్‌లోకేట్ కావడం వంటి విషయాలు వెలుగులోకి వచ్చాయి. భార్యని హత్య చేసి, ఆత్మహత్యగా చిత్రీకరించినట్లు పోలీసులు నిర్ధారించి కోర్టులో సమర్పించారు. విచారించిన ఎల్‌బీనగర్ జిల్లా అదనపు న్యాయమూర్తి జయలక్ష్మి నిందితుడు మానేష్‌గౌడ్‌కి పదేళ్ల జైలుతో పాటు, రూ.5 లక్షల జరిమానా విధించారు.

అతివేగంతో అదుపుతప్పిన స్కూల్ బస్సు

- రోడ్డు పక్కకు దూసుకెళ్లిన వైనం
- స్వల్పగాయాలతో బయటపడిన చిన్నారులు
- ఫిట్‌నెస్‌లేని బస్సును సీజ్ చేసిన అధికారులు


బస్సు కిటికీలోంచి విద్యార్థులను దించుతున్న తల్లిదండ్రులు

చేవెళ్ల: అతివేగం కారణంగా ఓ స్కూల్ బస్సు అదుపుతప్పింది. రోడ్డు పక్కనే ఉన్న గుంతలోకి దూసుకెళ్లి నిలిచిపోయింది. ఈ ఘటన చనువెళ్లి అనుబంధ గ్రామం ఇక్కారెడ్డిగూడ సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన ప్రకారం.. మండల కేంద్రంలోని సిల్వర్ డేల్ పాఠశాలకు చెందిన స్కూల్ బస్సులో రోజు మాదిరిగానే పామెన, చనువెళ్లి, ఇక్కారెడ్డి గ్రామాల నుంచి విద్యార్థులను తీసుకుని వెళ్తున్నారు. డ్రైవర్ సడెన్ బ్రేక్ వేయడంతో బస్సు రోడ్డు పక్కన గుంతలోకి దూసుకెళ్లింది. బస్సు పూర్తిగా ఒక వైపు ఒరగడంతో చిన్నారులు ఒకరిపై ఒకరు పడి స్వల్పంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ఘటనా స్థలికి చేరుకుని విద్యార్థులను కిటికీలోంచి కిందకు దించారు. క్షతగాత్రులను చేవెళ్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఒకరికి వాంతులు అవ్వడంతో తల్లిదండ్రులు వైద్యుల సూచన మేరకు పట్నం మహేందర్‌రెడ్డి ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల యాజమాన్యం తీరుపై మండిపడుతున్నారు. పరిమితికి మించి విద్యార్థులను ఎక్కిస్తున్నారని.. డ్రైవర్‌లు ఓవర్ స్పీడ్‌గా వెళ్తున్నారని చెప్పినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న కళాశాల కరస్పాండెంట్ మోనాచారి, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బస్సు డ్రైవర్ కుక్క అడ్డురావటంతో తప్పించే క్రమంలో జరిగిందని స్పీడ్‌లో లేనని చెప్పాడు. ఠాణాలోని బస్సును పరిశీలించిన ఆర్టీఓ అధికారులు ఫిట్‌నెస్ లేని కారణంగా సీజ్ చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.